సాక్షి
మహబూబాబాద్

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



కార్పొరేట్ శక్తులపైనే పోరాటం

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రధాని మోదీ కార్పొరేట్, మతోన్మాద శక్తులపైనే తమ పోరాటమని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ అన్నారు. - 8లో▸



16 రైళ్లకు హాల్టింగ్ ఎత్తివేత

కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో గల బల్లార్షా సెక్షన్‌లో మూడో రైల్వే లైన్ పనులతో ఆసిఫాబాద్, రెచ్నీలో పలు రైళ్లకు హాల్టింగ్ ఎత్తివేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.7°/15.3°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

హైదరాబాద్‌కు తరలివెళ్లిన స్టాఫ్‌నర్సులు



మహబూబాబాద్: జిల్లాలోని 93మంది స్టాఫ్‌నర్సులు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకునేందుకు బుధవారం జిల్లా కేంద్రం నుంచి రెండు బస్సుల్లో హైదరాబాద్‌కు తరలివెళ్లినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశాలతో అన్ని ఏర్పాట్లు చేసి పంపినట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ అంబరీష, జిల్లా ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ, డిప్యూటీ సీఈఓ నర్మద, కలెక్టరేట్ ఏఓ వెంకటరమణ, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

29వరకు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి

మహబూబాబాద్: జిల్లాలోని ఆహారభద్రత కార్డుదారులు ఈనెల 29లోపు సంబంధిత చౌకధరల దుకాణాల వద్దకు వెళ్లి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని డీసీఎస్‌ఓ రాజేందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ రేషన్‌షాపు వద్ద తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



మహబూబాబాద్ అర్బన్/గార్ల: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గార్ల మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన యలమంచిలి వెంకటేశ్వరరావును నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బుధవారం నియామక ఉత్తర్వులు జారీచేశారు. కాగా ఆయన విశ్వహిందూ పరిషత్‌లో పనిచేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తన నియామకానికి కృషిచేసిన నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

12న గార్ల ఎంపీపీ ఎన్నిక



గార్ల: ఈనెల 12న గార్ల ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు మహబూబాబాద్ ఆర్డీఓ, ఎన్నికల అధికారి అలివేలు ప్రకటించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇటీవల గార్ల ఎంపీపీ శివాజీచౌహాన్ వ్యక్తిగత కారణాల వల్ల తన పదవికి రాజీనామా చేశారన్నారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు నూతన ఎంపీపీ ఎన్నిక ఈనెల 12న నిర్వహిస్తున్నామని, ఈ నెల 8వ తేదీలోపు మండలంలోని 11మంది ఎంపీటీసీలకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. ఉదయం 11గంటలకు ఎంపీపీ ఎన్నిక ఉంటుందని, ఎంపీటీసీలు అందరూ ఎంపీడీఓ కార్యాలయానికి విధిగా హాజరు కావాలని ఆమె సూచించారు. సమావేశంలో తహసీల్దార్ స్వాతిబిందు, ఎంపీడీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదు



దంతాలపల్లి: ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం తగదని డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ శాంతకుమారి అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం రెండో విడత ప్రజావేదికకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు అధికారులు సక్రమంగా నిర్వహించాలన్నారు. పని చేసిన ప్రతీ కూలీకి డబ్బులు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కొంతమంది కూలీల అకౌంట్లలో డబ్బులు పడలేదని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లగా.. తపాలా అధికారులను పిలిచి సమస్య త్వరగా పరిష్కరించాలని సూచించారు. మండంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.18,9488 లెక్కల్లోకి రాలేదని గుర్తించినట్లు ఆమె తెలిపారు. రికవరీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ ఉమామల్లారెడ్డి, ఏపీఓ యాకూబ్, ఎస్‌ఆర్‌పీ రాజు, ఎంపీడీఓలు విజయలక్ష్మి, గోవిందరావు, డీఆర్పీలు, టీఏలు, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యం



జిల్లాలో విచ్చలవిడిగా ప్రైవేట్ ఆస్పత్రుల ఏర్పాటు

- అనుమతులు, వసతులు కరువు
- చోద్యం చూస్తున్న అధికారులు
- అరకొర వైద్యంతో రోగుల ప్రాణాలతో చెలగాటం

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కనీస వసతులు లేకుండా నిర్వహణ చేపడుతున్నారు. ఇదికాకుండా అనుమతులు ఒకరిపేరున.. ఆస్పత్రి నిర్వహణ మరొకరి పేరున చేపడుతున్న ఆస్పత్రులు ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల్లో అర్హత లేని వైద్యులు అరకొర వైద్యం అందిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షించాల్సిన వైద్యాధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో పలు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

అనుమతులు లేకుండా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆస్పత్రి, మెడికల్ షాపు, స్కానింగ్ సెంటర్ ఏర్పాటు కోసం అనుమతులు తీసుకోవాలి. ఇందుకోసం సదరు యజమానికి ఉన్న అర్హతను చూపించడంతో పాటు అందించే సేవలు కూడా వివరించాలి. కానీ జిల్లాలో మాత్రం పలువురు అనుమతులు లేకుండానే ఆస్పత్రులను ఏర్పాటు చేసి తాము చేసిందే వైద్యం అన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లా కేంద్రం మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ పట్టణాలతో పాటు పలు మండల కేంద్రాల్లో ఆస్పత్రులు వెలిశాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా 200 మేరకు ప్రైవేట్ ఆస్పత్రులు ఉంటాయని అంచనా. ఇందులో వైద్యారోగ్యశాఖ అనుమతులు తీసుకున్నవి మాత్రం 103 ఉన్నట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు. మిగిలినవి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు సమాచారం.

వసతుల లేమి..

ఆస్పత్రుల ఏర్పాటు కోసం వైద్యారోగ్యశాఖ పేర్కొన్న నిబంధనలు పాటిస్తామని ముందస్తు చెప్పి అనుమతులు తీసుకున్న తర్వాత అవేమీ పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. జిల్లాలో 12 మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల అనుమతులు తీసుకున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్యులు అందుబాటుతో పాటు ఆస్పత్రి నిర్వాహకులు, ప్రభుత్వం గుర్తింపు పొందిన కళాశాలల్లో చదివిన రేడియాలజిస్టులు, స్టాఫ్ నర్సులతోపాటు ప్రథమ చికిత్స సర్టిఫికెట్ పొందిన మెడికల్ సహాయకులు ఉండాలి. అదేవిధంగా జనరేటర్, ప్రత్యేక వసతులతో కూడిన ఆపరేషన్ థియేటర్, ఇతర వసతులతో గదులు ఉండాలి. కానీ జిల్లాలో అత్యధిక మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఇవేమీ కనిపించడం లేదని, ఏ అర్హత లేని వారితో వైద్యం అందిస్తున్నారనే ఫిర్యాదుల ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు..



ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణ, అసలు అనుమతులు లేకుండా వైద్యం చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకరిపై అనుమతి తీసుకొని.. మరొకరు వైద్యం చేస్తున్న ఆస్పత్రులు ఉన్నాయి. కనీస వసతులు కల్పించకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇలా సరైన వైద్యులు, వసతులు లేకపోవడంతో మహబూబాబాద్, తొర్రూరులో పలువురు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఈ సందర్భంగా మృతుల కుటుంబీకులు గొడవలు చేయడం.. వారికి ఆస్పత్రుల యాజమాన్యాలు డబ్బులు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఇలాంటి ఘటనలపై స్పందించకుండా అధికారులకు మధ్యవర్తుల ద్వారా మాముళ్లు ఇస్తున్నట్లు ప్రచారం. ఈ మేరకు వైద్యశాఖలోని ఓ ఉద్యోగి ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి నెలనెలా మాముళ్లు వసూలు చేసి ఆ శాఖలోని ఉద్యోగులు, అధికారులకు పంచుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈక్రమంలో ఏమైనా ఘటనలు జరిగినప్పుడు అధికారులు పట్టించుకోవడం లేదని, ఎవరైనా తమ దృష్టికి తీసుకొచ్చి ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పి చేతులు దులుపుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వైద్యశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులకు మద్దతిస్తున్న అధికారులపై కూడా చర్య తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు చేస్తున్నాం..

ప్రైవేట్ ఆస్పత్రుల ఏర్పాటు, నిర్వహణ, వసతులపై తనిఖీలు చేస్తున్నాం. ఇటీవల పలు ఆస్పత్రులపై ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేశాం. అనుమతులు లేని ఆస్పత్రులు పర్మిషన్ తీసుకోవాలని హెచ్చరించాం. అనుమతులు లేకపోయినా.. నిబంధనలు పాటించకపోయినా చర్యలు తీసుకుంటాం.

- అంబరీష, డీఎంహెచ్‌ఓ

సర్వం సిద్ధం

- నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు
- నామమాత్రంగా ప్రయోగ పాఠాలు
- ఈ ఏడాది ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లోనూ ప్రయోగ పరీక్ష



మహబూబాబాద్ అర్బన్: ఇంటర్ విద్యార్థులకు నేటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు జిల్లాలోని కాలేజీల్లో తగిన ఏర్పాట్లు చేశారు. కాగా చాలా వరకు ప్రభుత్వ కాలేజీల్లో సరైన పరికరాలు, రసాయనాలు లేక ప్రయోగ పాఠాలు బోధించలేదు. దీంతో చాలా మంది విద్యార్థులు సరైన అవగాహన లేకుండానే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకావాల్సిన పరిస్థితి నెలకొంది.

15వ తేదీ వరకు..

జిల్లాలో ఈనెల 15వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతాయి. జిల్లాలో 9,627మంది విద్యార్థులు హాజరవుతారు. జనరల్ విద్యార్థులకు 29 పరీక్ష కేంద్రాలు, వొకేషనల్ విద్యార్థులకు 17పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయి. కాగా ఈ ఏడాది నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. ఈ పరీక్ష 16న నిర్వహిస్తారు. అలాగే 17న నైతికత, మానవీయ విలువలు, 19న పర్యావరణం పరీక్ష నిర్వహించనున్నారు.

30నిమిషాల ముందు చేరుకోవాలి

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు రాసే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి 30 నిమిషాల ముందు చేరుకోవాలి. హాల్ టికెట్ సెక్షన్‌లో సమయం బట్టి పరీక్షలకు హాజరుకావాలి. గైర్హాజరైన విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయినట్టే. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులకు అనుమతి లేదు.

- సమ్మెట సత్యనారాయణ, డీఐఈఓ

పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ రహదారులు, రైల్వే మూడో లైన్, దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకం, ఎస్సారెస్పీ రెండో స్టేజీ పనుల ప్రగతిపై అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా మీదుగా వెళ్లే రహదారుల పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. రైల్వే మూడో లైన్ కోసం భూసేకరణ, నష్టపరిహారం చెల్లించాలన్నారు. నీటిపారుదల శాఖ ద్వారా పెద్దవంగర మండలం పోచంపల్లిలో చేపట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకం పనులు, 14వ ప్యాకేజీ కింద చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం పనులను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఆర్డీలు అలివేలు, నర్సింహారావు, ఆర్‌అండ్‌బీ ఈఈ తానేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మొసలి కలకలం

కొత్తగూడ: మండలంలోని మైలారం గ్రామ సమీప పొలాల్లో మొసలి కలకలం రేపింది. బుధవారం పాకాల సరస్సు శిఖం పొలాల్లోకి మొసలి వచ్చింది. యాసంగి పనుల్లో నిమగ్నమైన రైతులు మొసలిని చూసి ఆందోళన చెందారు. రైతులంతా కలసి అరుస్తూ దానిని పాకాల సరస్సుకు తరిమారు.

మాదకద్రవ్యాల రవాణాపై నిఘా ఉండాలి

- ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్

మహబూబాబాద్ రూరల్: జిల్లాలో మాదకద్రవ్యాల రవాణాపై పటిష్ట నిఘా పెట్టాలని ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ అధికారులతో మహబూబాబాద్ టౌన్ పోలీస్ సమావేశ మందిరంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మట్కా, పేకాట, అక్రమంగా మద్యం రవాణాపై ముందస్తు సమాచారం సేకరించి చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలను రవాణాచేసేవారు, విక్రయదారులపై కేసులు నమోదు చేయాలన్నారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. నిర్ణీత గడువులోగా పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో, రేప్ కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని ఆదేశించారు. దొంగతనాలు, దోపిడీలు, ఇతర నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వాహన తనిఖీలు చేపట్టి జరిమానాలు విధిస్తూ, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు తీర్థాల సత్యనారాయణ, వెంకటేశ్వర బాబు, విజయ్ ప్రతాప్, మోహన్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్

పంటల వివరాలు నమోదు చేయాలి

మహబూబాబాద్ రూరల్: యాసంగిలో సాగు చేస్తున్న వ్యవసాయ, ఉద్యాన పంటల వివరాలను సర్వే నబర్ల వారీగా క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదు చేయాలని డీఏఓ ఎం.లక్ష్మీనారాయణ ఏఈఓలను ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, ఏఈఓలతో మానుకోట రైతు వేదికలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. యాసంగిలో అన్ని రకాల వ్యవసాయ, ఉద్యాన పంటలను సాగు చేయడం పూర్తి అయిందని తెలిపారు. ఆ పంటలను క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. దీనిపై మండల వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి కె.సూర్యనారాయణ మాట్లాడుతూ.. జిల్లాలో 6,600 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉందని, ప్రతి ఎకరాన్ని సర్వే నంబర్ వారీగా నమోదు చేయాలని పేర్కొన్నారు. పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేస్తున్న రైతుల వివరాలను కూడా క్రాప్ బుకింగ్ నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో మరిపెడ ఏడీఏ శోభన్‌బాబు, టెక్నికల్ ఏడీఏ రాజనరేందర్, టెక్నికల్ ఏఓ సారయ్య, ఏఓలు, ఏఈఓలు, ఉద్యాన అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏఓ లక్ష్మీనారాయణ

కేంద్ర బడ్జెట్‌పై ‘ఓరుగల్లు’ ఆశలు

మామునూరు విమానాశ్రయానికి నిధులు కేటాయించాలి

- ఈసారైనా మేడారం జాతరకు జాతీయ హోదా వచ్చేనా?
- గిరిజన వర్సిటీ పనుల్లో వేగిరం పెంచేలా చూడాలి
- కాకతీయ మెగా టెక్స్‌టైల్‌కు మిత్ర సహాయం పెంచాలని డిమాండ్
- పెండింగ్ రైల్వే పనులకు మోక్షం కలిగేనా..
- నేడు పార్లమెంట్‌లో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్



సాక్షి, వరంగల్: ఈ ఏడాది పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం గురువారం ఓట్ అన్ అకౌంట్ చివరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ తరుణంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై అన్ని వర్గాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి వరంగల్‌లో అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల విడుదలపై ఆశగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా వరంగల్ మామునూరు విమానాశ్రయం, పీఎం మిత్ర కింద ఎంపికైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు, ములుగులోని గిరిజన వర్సిటీ నిర్మాణానికి కేటాయించిన రూ.900 కోట్ల నిధుల విడుదలతోపాటు ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు జాతీయ హోదా ఇచ్చి నిధులు కేటాయించాలని డిమాండ్ వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలైన కాకతీయ కాలం నాటి ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపును చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. కొత్త జిల్లాలో ఈఎస్‌ఐ ఆస్పత్రులను ఏర్పాటుచేయడం ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు అందుబాటులో ఉంటాయంటున్నారు.

కాకతీయకు 'మిత్ర' సహాయం వేగం పెంచాలి..

రాష్ట్ర ప్రభుత్వం వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు పీఎం మిత్రలో ఇప్పటికే ఎంపికై ంది. పార్క్ అభివృద్ధికి రూ.కోట్లలో నిధులు కేటాయించడం ద్వారా మరిన్ని వస్త్ర పరిశ్రమలు ఇక్కడికి వచ్చే అవకాశముంది. అదేవిధంగా వరంగల్, మహబూబాబాద్ జిల్లాలో స్పిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కలర్డై యార్న్ల మిల్లులను కూడా ఏర్పాటుచేసేలా బడ్జెట్ కేటాయిస్తే ఇబ్బందులు తప్పుతాయని చేనేత కార్మికులు ఆశిస్తున్నారు.

మామునూరులో విమానం ఎగిరేనా..

ఇప్పటికే ఉడాన్ (ఉడో దేశ్‌కీ ఆమ్ నాగరిక్) కింద ఎంపికైన వరంగల్ మామునూరు విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని ఇక్కడిప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం 707 ఎకరాల భూమి ఉండగా, మరో 400 ఎకరాలు సేకరించాలని గుర్తించారు. వీరికి నష్టపరిహారంగా సుమారు రూ.130 కోట్లు అవసరం. రన్ వే మరమ్మతులు, విద్యుత్, నీరు, రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించి విమాన ప్రయాణాలను ప్రారంభించేలా కేటాయింపులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ రైల్వే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి..

కాజీపేట మీదుగా బల్లార్షా-విజయవాడ మూడో లైన్ నిర్మాణ పనులు మాత్రమే జరుగుతుండగా, కాజీపేట డివిజన్ ఏర్పాటు, బల్లార్షా-కాజీపేట ఫోర్త్ లైన్ నిర్మాణం ఇంకా పెండింగ్‌లో ఉంది. కాజీపేట నుంచి సికింద్రాబాద్ వరకు మూడో రైల్వే లైన్ సర్వే ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది. కాజీపేట-హసన్‌పర్తి- హుజూరాబాద్-కరీంనగర్ కొత్త రైల్వే లైన్ సర్వే ప్రతిపాదనలు దాటలేదు. కొత్తగూడెం, మణుగూరు నుంచి తాడ్వాయి అడవుల మీదుగా రామగుండం, భూపాలపల్లికి రెండు మార్గాల్లో సర్వే కోసం గతంలో బడ్జెట్‌లో ప్రతిపాదనలు రాగా ప్రైవేట్ సంస్థతో సరిపెట్టారు. కాజీపేట అయోధ్యపురంలో నిర్మిస్తున్న పిరియాడికల్ ఓవర్ హాలింగ్ షెడ్ (పీఓహెచ్) నిర్మాణ పనులు వేగిరం చేసేలా మరిన్ని నిధుల కేటాయింపు అవసరం ఉంది.

‘డబుల్’ ఇళ్ల లొల్లి

- డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం డబ్బులు ఇచ్చామంటున్న లబ్ధిదారులు
- పునాది దశలోనే నిర్మాణాలు
- వివాదాస్పదంగా మారిన 27ఇళ్ల వ్యవహారం



డోర్నకల్: జిల్లాలోని డోర్నకల్ మండలం తహసీల్‌దారు బంజర గ్రామంలో మూడేళ్ల క్రితం చేపట్టిన 27 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం వివాదాస్పదంగా మారింది. కొన్నేళ్లక్రితం దళితులకు మంజూరు చేసిన స్థలాల్లో 2020లో 27 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్టర్‌కు నిర్మాణ పనులను అప్పగించగా.. పనులను ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులు వసూలు..

డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలకు కేటాయించిన బడ్జెట్ సరిపోదని, లబ్ధిదారులు కొంత నగదు ఇవ్వాలని కాంట్రాక్టర్ డిమాండ్ చేశాడు. బీసీ లబ్ధిదారులు రూ.1.2 లక్షలు, ఎస్సీలు రూ.90 చెల్లించాలని అన్నారు. కాగా 26 మంది లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.30వేల నుంచి రూ.70వేల వరకు గ్రామ సర్పంచ్ అంకతి సీతారామయ్యకు అందించగా.. సర్పంచ్ సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. బేస్‌మెంట్ వరకు పనులు పూర్తయిన తర్వాత కరోనా ప్రభావంతో నిలిపోయాయి. కాగా చాలా రోజుల వరకు పనులు ప్రాంరభం కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళనకు దిగడంతో సర్పంచ్‌తో పాటు స్థానిక నాయకులు బేస్‌మెంట్ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించి నంబర్లు వేశారు. కాగా రెండేళ్లు గడిచినా నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించకపోవడంతో లబ్ధిదారులు తమ డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. దీంతో కొంతమంది ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పంచాయితీ నిర్వహించి వాయిదాలతో కాలం వెళ్లదీస్తున్నారు. వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేస్తాం..

తహసీల్‌దారు బంజరలో 27ఇళ్లకు సంబంధించి బేస్‌మెంట్‌స్థాయి నిర్మాణం రెండేళ్ల క్రితమే పూర్తయింది. ఇటీవల కాంట్రాక్టర్‌కు అన్ని రకాల పన్నులు కలిపి రూ.27లక్షల బిల్లులు అందాయి. నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించకుంటే కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేస్తాం.

- రాజశేఖర్, హౌసింగ్ ఏఈ

రూ.30వేలు ఇచ్చా..

నాకు డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు కాగా ఇంటి నిర్మాణ కోసం రూ.90 వేలు ఇవ్వాలనడంతో రూ.30 వేలు గ్రామ సర్పంచ్‌కు అందించా. ఇప్పటి వరకు ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించలేదు.

- గుడ్డేటి వెంకన్న, లబ్ధిదారుడు, తహసీల్‌దారుబంజర

చర్చలు జరుపుతున్నాం..

ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులు ఇచ్చిన రూ.12.6 లక్షలు సబ్ కాంట్రాక్టర్‌కు ఇచ్చాను. వివిధ కారణాలతో సబ్ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడం లేదు. నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులతో కలిసి కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్‌తో చర్చలు జరుపుతున్నాం.

- అంకతి సీతారామయ్య, సర్పంచ్, తహసీల్‌దారు బంజర

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



మేడారంలో పనులను పరిశీలిస్తున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: మేడారంలో ఐటీడీఏ ఇంజనీరింగ్ ద్వారా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మేడారంలోని కమ్యూనిటీ సెంటర్ 3, 4ని ఆయన బుధవారం సందర్శించి అక్కడ చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మేడారం ట్రైబల్ మ్యూజియం పరిశీలించి అక్కడ చేయాల్సిన పెయింటింగ్ పనులు గిరిజనుల సంప్రదాయాలు ప్రతిబింబించేలా చేయాలన్నారు. జాతర సమయంలో వస్తున్న వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మోడల్ పార్కింగ్ 40 ఎకరాలలో ఏర్పాట్లు చేసే విధంగా లైటింగ్, వాటర్ సరఫరాకు తగిన చర్యలు చేపట్టాలన్నారు.

క్లుప్తంగా

‘విజ్ఞాన్‌’ మహోత్సవ్‌కు పద్మశ్రీ సమ్మయ్యకు ఆహ్వానం


గడ్డం సమ్మయ్య

దేవరుప్పుల : ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులోని విజ్ఞాన్‌ డీమ్డ్‌ విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి 3వ తేదీ వరకు జరిగే నేషనల్‌ లెవల్‌ యూత్‌ ఫెస్టివల్‌కు ముఖ్య అతిథిగా పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్యకు ఆ విశ్వవిద్యాలయం డీన్‌ స్టూడెంట్‌ అఫైర్స్‌ ప్రతినిధి డాక్టర్‌ ఎంఎస్‌ఎస్‌ రుక్మిణీ ఆహ్వానం పలికారు. ఈ మహోత్సవంలో చిందు యక్షగాన కళాకారుడిగా గడ్డం సమ్మయ్యతోపాటు ఇండియన్‌ ఫిలిం యాక్టర్స్‌ దివ్య శ్రీపాద, కిరణ్‌ అబ్బవరం, మ్యూజిక్‌ కంపోజర్‌ కుంచె రఘు, ఇండియన్‌ క్రికెట్‌ టీమ్‌ సెలెక్టర్‌ ఎంఎస్‌కె ప్రసాద్‌, స్క్రీన్‌ రైటర్‌ బుర్ర సాయి మాధవ్‌, యాక్టర్‌ చెముడు హర్ష పాల్గొననున్నారు. ఈ విషయమై గడ్డం సమ్మయ్య మాట్లాడుతూ తాను బతుకుదెరువు కోసం కులవృత్తి వారసత్వంతో తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చిన తరుణంలో అదే గుర్తింపుతో పురస్కారం రావడం.. తిరిగి కళావేదికల్లో అవకాశం రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం

- రూ. 5 లక్షల మేర నష్టం

రామన్నపేట : వరంగల్‌ బట్టలబజార్‌లోని మమతా మ్యాచింగ్‌ సెంటర్‌లో గురువారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నిర్వాహకులు షాపు మూసివేసిన తరువాత షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చేలరేగి అగ్నిప్రమాదం జరిగినట్లు ఫైర్‌ అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో రూ. 5 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగినట్లు షాపు నిర్వాహకులు తెలిపారు.

ట్రాలీ మీద పడి యువకుడి మృతి


బాలకృష్ణ (ఫైల్‌)

తరిగొప్పుల: ట్రాక్టర్‌ మరమ్మతులు చేస్తుండగా ట్రాలీ(డబ్బా) మీద పడడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై దూదిమెట్ల నరేష్‌ కథనం ప్రకారం తరిగొప్పుల గ్రామానికి చెందిన కర్రె చంద్రయ్య, కోమలత దంపతుల కుమారుడు బాలకృష్ణ(18) ట్రాక్టర్‌ ట్రాలీ(డబ్బా) జాకీ మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాలీ ఒక్కసారిగా మీదపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో రైతు..


ఐలుమల్లు(ఫైల్‌)

కేసముద్రం: ఓ రైతు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు పూజారి ఐలుమల్లు (51) తన వ్యవసాయ భూమిలో నాటు వేసేందుకు గాను పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గుండెపోటుకు గురై పంట పొలంలో కుప్పకూలి మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది.



కార్పొరేట్‌, మతోన్మాద శక్తులపైనే పోరాటం

సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌
- బీజేపీని ఓడించకపోతే హక్కులుండవ్‌
- సీపీఎం పొలిట్‌ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
- పబ్లిక్‌గార్డెన్‌లో సీఐటీయూ బహిరంగ సభ
- హాజరైన వేలాది మంది కార్మికులు


సభకు హాజరైన కార్మికులు




మహాసభల్లో అభివాదం చేస్తున్న అతిథులు, నాయకులు, మాట్లాడుతున్న తపన్‌సేన్‌

హన్మకొండ చౌరస్తా: కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రధాని మోదీ, కార్పొరేట్‌, మతోన్మాద శక్తుల పైనే తమ పోరాటమని సెంటర్‌ ఆఫ్‌ ఇండియన్‌ ట్రేడ్‌ యూనియన్స్‌ (సీఐటీయూ) ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌ అన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాసలో జరగనున్న సీఐటీయూ ఆలిండియా వర్కింగ్‌ కమిటీ సమావేశాల్లో భాగంగా మొదటి రోజు హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని డాక్టర్‌ నేరేళ్ల వేణుమాధవ్‌ కళాప్రాంగణంలో బుధవారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభకు ముందు హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి పబ్లిక్‌గార్డెన్‌ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి. ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి తపన్‌సేన్‌ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో అన్ని రంగాలను ప్రైవేటీకరణ చేస్తున్న మోదీ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. ఇటీవల దేశంలో ట్రాన్స్‌పోర్ట్‌ కార్మికులు చేపట్టిన సమ్మె అభినందనీయమన్నారు. 75 ఏళ్ల స్వాతంత్య్రంలో జరగని అభివృద్ధి, పదేళ్లలోనే జరిగిందని బీజేపీ నేతల ప్రచారం చేస్తున్నారన్నారు. గతేడాది నవంబర్‌ 26, 27, 28 తేదీల్లో దేశ వ్యాప్తంగా కార్మికులు, కర్షకులు ఐక్యంగా చేపట్టిన సహాపదావ్‌లో ఏడు లక్షల మంది కార్మికులు పాల్గొని మోదీ సర్కార్‌ను హెచ్చరించారన్నారు. బీజేపీ.. మతాన్ని అడ్డుపెట్టుకుని రాబోయే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రావాలని చూస్తోందని, ఇందులో భాగంగా అయోధ్యలో రామాలయ నిర్మాణం సాధ్యమైందని ప్రచారం చేసుకుంటుందన్నారు. ఫిబ్రవరి 18వ తేదీన చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సీపీఎం పొలిట్‌ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే దేశంలో హక్కులుండవన్నారు. దేశంలో మోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగం, హక్కులు ప్రమాదంలో పడ్డాయన్నారు. ప్రశ్నించే కవులు, మేధావులు, ఉద్యమకారులను మోదీ జైల్లో పెట్టించారని విమర్శించారు. దేశంలో సనాతన ధర్మాన్ని అమలు చేస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారని, సనాతన ధర్మం పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒక విధానం రూపొందించాలని డిమాండ్‌ చేశారు. కార్మిక పోరాటాలను అణిచివేసినందుకే కార్మికులు బీఆర్‌ఎస్‌ను ఓడించి కేసీఆర్‌ను గద్దె దింపారన్నారు. సమావేశంలో సీఐటీయూ ఆలిండియా కార్యదర్శి వీఆర్‌ సందు, రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, కోశాధికారి సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌, రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేష్‌, రాగుల రమేష్‌, జిల్లా ఉపాధ్యక్షులు గాదె ప్రభాకర్‌రెడ్డి, ఎం రజిత, బొట్ల చక్రపాణి, ఎం చుక్కయ్య, సారంపల్లి వాసుదేవరెడ్డి, బాధ్యులు దొగ్గెల తిరుపతి, గొడుగు వెంకట్‌ పాల్గొన్నారు.

ఒంటరి బాలికను ఆదుకోరూ!

- తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి
- ఆపన్న హస్తం అందించాలని బంధువులు, గ్రామస్తుల వేడుకోలు


రేణుక


చిన్నారి నివసిస్తున్న టెంట్‌

దీన గాథ

రాయపర్తి : శత్రువులకు కూడా ఇలాంటి దుస్థితి రావొద్దేమో. అనారోగ్యంతో కొంతకాలం క్రితం తండ్రి.. అదే కారణంతో ఇటీవల తల్లి కూడా మృతి చెందింది. దీంతో ఓ బాలిక అనాథ అయింది. ఆలనాపాలన చూసే వారు లేక అల్లాడుతోంది. తినడానికి తండి లేదు. ఉండడానికి ఇల్లు లేదు. దీంతో ఆ బాలిక పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. ఈ హృదయవిదారక ఘటన మండలకేంద్రంలోని అంబేడ్కర్‌కాలనీలో నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. రాయపర్తి మండల కేంద్రానికి చెందిన ఐత యాకయ్య, కొమురమ్మ దంపతులకు కుమార్తె రేణుక (10) ఉంది. ఈ దంపతులు కూలీ చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. ఈ క్రమంలో కొంతకాలం క్రితం యాకయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కన్నీళ్లు దిగమింగుకుని రెక్కలు ముక్కలు చేసుకుంటూ కొమురమ్మ తన కూతురు రేణుకను పోషించుకుంది. ఈ క్రమంలో కొమురమ్మ కూడా అనారోగ్యంతో ఈనెల 27న మృతి చెందింది. దీంతో తల్లిందండ్రులను కోల్పోయిన రేణుక పరిస్థితి హృదయ విదారకరంగా మారింది. తినడానికి తిండి లేదు. ఉండానికి ఇల్లు లేదు. ఫలితంగా బాలిక పరిస్థితి నడిసంద్రంలో నావాలా తయారైంది. కాగా, మృతులది పూరిల్లు కావడంతో వర్షాల కారణంగా పూర్తిగా కూలిపోయింది. దీంతో కొన్ని రోజులుగా టెంట్‌ కిందే జీవనం కొనసాగిస్తున్నారు. దీనిపై దాతలు ముందుకువచ్చి బాలికను ఆదుకోవాలని బంధువులు, గ్రామస్తులు కోరుతున్నారు. కాగా, రేణుకకు మండలకేంద్రంలోని వెంకటరమణ ఐరన్‌ అండ్‌ సిమెంట్స్‌, పెయింట్స్‌ షాపు యజమాని ఉల్లెంగుల వెంకన్న రూ.5వేల ఆర్థిక సాయం చేశారు.

దాతలు స్పందించి 9963941016 ఈ నంబర్‌కు ఫోన్‌ పే లేదా గూగుల్‌ పే ద్వారా ఆర్థిక సాయం చేయాలని బంధువులు, గ్రామస్తులు వేడుకుంటున్నారు.

16 రైళ్లకు ఆసిఫాబాద్‌, రేచ్నీలో హాల్టింగ్‌ ఎత్తివేత

- నేటినుంచి అమలు
- మూడో రైల్వే లైన్‌ పనులతో నిర్ణయం



కాజీపేట రూరల్‌: కాజీపేట సబ్‌ డివిజన్‌ పరిధిలో గల బల్లార్షా సెక్షన్‌లో మూడో రైల్వే లైన్‌ పనులతో ఆసిఫాబాద్‌, రేచ్నీరోడ్‌ రైల్వేస్టేషన్లలో కాజీపేట జంక్షన్‌ మీదుగా ప్రయాణించే పలు రైళ్లకు గురువారం నుంచి 19వ తేదీ వరకు తాత్కాలిక హాల్టింగ్‌లను ఎత్తివేసినట్లు బుధవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

ఆసిఫాబాద్‌లో హాల్టింగ్‌లను ఎత్తివేసిన రైళ్లు ఇవే..

కాజీపేట-సిర్పూర్‌ టౌన్‌ (17003) ప్యాసింజర్‌, హైదరాబాద్‌-సిర్పూర్‌ కాగజ్‌నగర్‌ (17011) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌, భద్రాచలం-సిర్పూర్‌ టౌన్‌ (17033) సింగరేణి, సికింద్రాబాద్‌-సిర్పూర్‌ కాగజ్‌నగర్‌ (17233) ఎక్స్‌ప్రెస్‌, సిర్పూర్‌కాగజ్‌నగర్‌-సికింద్రాబాద్‌ (17234) ఎక్స్‌ప్రెస్‌, సిర్పూర్‌కాగజ్‌నగర్‌-సికింద్రాబాద్‌ (17012) ఎక్స్‌ప్రెస్‌, సిర్పూర్‌ టౌన్‌-భద్రాచలం (17034), కరీంనగర్‌-సిర్పూర్‌ టౌన్‌ (07765) ప్యాసింజర్‌, సిర్పూర్‌టౌన్‌-కరీంనగర్‌ (07766) ప్యాసింజర్‌, సింగరేణి, బల్లార్షా-కాజీపేట (17004) రామగిరి ప్యాసింజర్‌.

రేచ్నీలో హాల్టింగ్‌ తొలగించిన రైళ్లు ఇవే

హైదరాబాద్‌-సిర్పూర్‌ కాగజ్‌నగర్‌ (17011) ఎక్స్‌ప్రెస్‌, సికింద్రాబాద్‌-సిర్పూర్‌ కాగజ్‌నగర్‌ (17233) ఎక్స్‌ప్రెస్‌, సిర్పూర్‌కాగజ్‌నగర్‌-సికింద్రాబాద్‌ (17234) ఎక్స్‌ప్రెస్‌, సిర్పూర్‌కాగజ్‌నగర్‌-సికింద్రాబాద్‌ (17012) ఎక్స్‌ప్రెస్‌ కరీంనగర్‌-సిర్పూర్‌ టౌన్‌ (07765) ప్యాసింజర్‌, సిర్పూర్‌ టౌన్‌-కరీంనగర్‌ (07766) ప్యాసింజర్‌. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి రైల్వేకు సహకరించాలని అధికారులు కోరారు. మూడో రైల్వేలైన్‌ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ


మాట్లాడుతున్న పశ్య పద్మ

హన్మకొండ : కౌలు రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ‘కౌలు రైతులు-వారి జీవనోపాధి’ అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో పశ్య పద్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లోనూ కౌలు రైతులను లబ్ధిదారులుగా చేర్చుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతు రక్షణకు చట్టాలున్నా అవి వారిని ఆర్థికంగా ఆదుకోలేకపోయాయన్నారు. ప్రభుత్వ పథకాలలో కౌలు రైతులను విస్మరించి అన్యాయం చేశాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేసిన కౌలుదారుల గుర్తింపు చట్టం తెలంగాణ రాష్ట్రంలో అమలుకు నోచుకోలేదన్నారు. కౌలు రైతులకు న్యాయం చేయాలంటే భూ యజమానుల ఆందోళన అడ్డంకిగా మారిందన్నారు. అందుకే కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందించాలన్నారు. అలాగే, గ్రామ సభలు నిర్వహించి కౌలు చేసుకునే వ్యవసాయ కుటుంబాల గణన చేయాలని సూచించారు. వీరికి కౌలు గుర్తింపు కార్డులు అందించాలని, ప్రతి సంవత్సరం గ్రామ సభల ద్వారా వీరి జీవనోపాధి కొనసాగుతుందా లేదా నిర్ధారించాలన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ పార్టీ కౌలు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సదస్సులో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంత్‌ రావు, తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెట్టం నారాయణ, ప్రధాన కార్యదర్శి కొప్పుల సూర్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యామసుందర్‌ రెడ్డి, కార్యదర్శి కొంగల రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ బోల్తా.. ఆరుగురికి గాయాలు


ట్రాక్టర్‌ ప్రమాదంలో గాయపడిన కూలీలు


వెంకటాపురం(కె): మండలంలోని పాత్రాపురం గ్రామ శివారులో కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌ బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం మిర్చి పంటను తెంపడానికి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 20 మంది కూలీలు మండలానికి వచ్చారు. ఈ క్రమంలో వంట చెరుకు కోసం బుధవారం అడవికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ట్రాక్టర్‌ అదుపు తప్పింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న 20 మంది కిందపడ్డారు. ఇందులో ఆరుగురికి గాయాలు కాగా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో స్థానికులు వెంటనే 108లో క్షతగాత్రులను వెంకటాపురం(కె) వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అంగన పల్లి రీనా, బద్దం మీన, కుడియం మాసికి స్వల్ప, పర్షిక నీల, పర్షిక సాకిత, కుడియ రత్మికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన వారిని మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో దారి దోపిడీ ముఠా?



హసన్‌పర్తి: ముగ్గురు దారి దోపిడీ దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితం ఈ దారి దోపిడీ ముఠా వంగపహాడ్‌లోని జాతీయ రహదారిపై హల్‌చల్‌ సృష్టించినట్లు తెలిసింది. దారి వెంట వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.15వేలు లాక్కున్నట్లు సమాచారం. కాగా, స్థానికులు పోలీసులకు కాల్‌ చేయడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అనంతరం విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

మెట్ల బావిని సందర్శించిన విదేశీయుడు


మెట్ల బావిని పరిశీలిస్తున్న అమెరికా దేశస్తుడు

ఖిలా వరంగల్‌: వరంగల్‌-ఖమ్మం రోడ్డుపై శివనగర్‌లోని చారిత్రక ప్రసిద్ధి చెందిన మెట్లబావి (రాణిరుద్రమదేవి స్నానాల బావి)ని బుధవారం అమెరికా దేశస్తుడు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన బావి నిర్మాణ శైలిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం బావి గోడలపై ఉన్న శిల్ప సౌందర్యాలను ఆసక్తిగా కెమెరాలో ఫొటోలు తీసుకున్నారు. బావి విశిష్టత, నిర్మాణ శైలిని బావి పరిరక్షణ కమిటీ సభ్యుడు బజ్జూరు అంజయ్య అతడికి వివరించారు. అనంతరం విదేశీయుడు మధ్య కోటను సందర్శించారు. ఆయన వెంట టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్‌ గట్టికొప్పుల అజయ్‌, పురావస్తుశాఖ కో-ఆర్డినేటర్‌ శ్రీకాంత్‌, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి ఘటనలో నలుగురికి జైలు

- ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా

మరిపెడ రూరల్‌: మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ పరిధిలోని ఆముదాల గడ్డతండాలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన నలుగురికి తొర్రూరు జూనియర్‌ సివిల్‌ జడ్జి మట్ట సరిత ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు మరిపెడ ఎస్సై ఎస్‌కే తాహేర్‌ బాబా బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. 2016 సంవత్సరంలో ఆముదాల గడ్డతండా శివారు వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వేప చెట్టు నరికిన విషయంలో మాలోతు తలస్యతో మాలోతు జగన్‌, కస్న, సింగన్న, శంకర్‌కు గొడవ జరిగింది. ఈ క్రమంలో తలస్యపై దాడి చేయడంతో మరిపెడ పోలీస్‌ స్టేషన్‌లో బాధితుడు నలుగురిపై ఫిర్యాదు చేశాడు. దీంతో అప్పటి ఎస్సై జి. బాబులాల్‌ చార్జ్‌షీట్‌ దాఖలు చేశారు. ఈ మేరకు కోర్టులో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ డి. గణేష్‌ ఆనంద్‌ వాదించారు. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి సరిత.. నిందితులకు ఏడాది జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

డేరాల్లో సోలార్‌ వెలుగులు


డేరాకు ఏర్పాటు చేసి సోలార్‌


రాత్రి సమయంలో వెలుగుతున్న సోలార్‌లైటు

ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం అనంతపురం జిల్లాకు చెందిన వారు బతుకుదెరువు నిమిత్తం రాయపర్తికి వచ్చారు. ప్లాస్టిక్‌ డబ్బాలు, బుట్టలు ఇతర వస్తువులను ఊరూరా తిరిగి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు బసచేసే ప్రాంతాల్లో విద్యుత్‌ సదుపాయం లేకపోవడంతో సోలార్‌ ప్లేట్‌ ఆధారంగా విద్యుత్‌ వినియోగిస్తున్నారు. రాత్రిపూట వెలుగుతోపాటు సెల్‌ఫోన్లకు చార్జింగ్‌కు ఉపయోగపడుతున్నట్లు సదరు వ్యాపారులు తెలిపారు.

- రాయపర్తి

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ కేవలం 2500/- పెట్టుబడితో Mobile App ద్వారా వ్యాపారం (Old / New) అభివృద్ధి, మార్కెటింగ్‌ ఆదాయం AP/TS జిల్లాల వారిగా ఫ్రాంచేసీస్‌ కొరకు. 8106024624. [WA-7282]

■ హౌస్‌, ఫ్లాట్‌, వ్యవసాయ భూములు మార్టిగేజ్‌ చేసుకొని అమౌంట్‌ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Man Power Service చేయబడును. సంప్ర॥ 7659010270. [WA-7277]

FINANCE SERVICES

■ సిరి అసోసియేట్స్‌ అన్ని రకాల రుణాలు, పర్సనల్‌ హౌసింగ్‌ మార్ట్‌ గేజ్‌ ఓపెన్‌ ప్లాట్స్‌ పై కూడా సివిల్‌ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్‌: 9666142226 [W-788988]

WANTED

■ Govt (Regd) సంస్థ తరపున Work చేయుటకు సొంత కంప్యూటర్‌ గలవారు కావలెను. ఇంటి దగ్గరే వర్క్‌ చేస్తూ 9 to 19K వరకు సంపాదించే అవకాశం. సెల్‌: 8977429273. [W-788986]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ ఒమేగా హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు, వర్కర్స్‌/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 20k ఫోన్‌: 8977639662/8977639663. [H-793685]

■ వరంగల్‌, మండి బజార్‌ ఆఫీసులో పని చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్‌ కావలెను. వయసు: 25-36, తెలుగు, హింది, ఇంగ్లిష్‌ తెలిసినవారు సంప్ర॥ 9997130135 [HA-14068]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్‌	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్‌	9010144453
పరకాల	9010299096
జయశంకర్‌ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పలు విభాగాలకు అధిపతుల నియామకం

కాకతీయ యూనివర్సిటీలోని పలు విభాగాలకు అధిపతులను నియమించారు. రిజిస్ట్రార్‌, దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌, పరీక్షల నియంత్రణాధికారి, యూనివర్సిటీ పీజీ కళాశాల, తదితర విభాగాలకు హెచ్‌ఓడీలను నియమించగా వారు బాధ్యతలు స్వీకరించారు.

కేయూ రిజిస్ట్రార్‌గా మల్లారెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లారెడ్డి

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా మ్యాథమెటిక్స్‌ విభాగం ఆచార్యుడు పి.మల్లారెడ్డిని నియమించారు. ప్రస్తుత రిజిస్ట్రార్‌ టి.శ్రీనివాస్‌రావు పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో మల్లారెడ్డిని నియమిస్తూ వీసీ తాటికొండ రమేష్‌ అప్రూవల్‌ మేరకు అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ పెండ్లి అశోక్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు శ్రీనివాస్‌రావు నుంచి మల్లారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మల్లారెడ్డి మ్యాథమెటిక్స్‌ విభాగంలో 2007లో అసోసియేట్‌ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. కొన్నేళ్లుగా ప్రొఫెసర్‌గా కొనసాగారు. ప్రస్తుతం సైన్స్‌డీన్‌గా కొనసాగుతున్నారు.

దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా రాంచంద్రం



కాకతీయ యూనివర్సిటీ దూర విద్యాకేంద్రం (ఎస్‌డీఎల్‌సీఈ) డైరెక్టర్‌గా దూరవిద్యకేంద్రంలో జాయింట్‌డైరెక్టర్‌గా ,సైకాలజీ విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆచార్య వి రాంచంద్రంను నియమిస్తూ రిజిస్ట్రార్‌ టి శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీజేశారు. దూరవిద్యకేంద్రం డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌రావు పదవీకాలం పూర్తికావడంతో ఆయన స్థానంలో రాంచంద్రంను నియమించగా బాధ్యతలు స్వీకరించారు.

యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వరలక్ష్మి



కేయూ పరిధిలోని హనుమకొండ సుబేదారిలో ఉన్న యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్‌ పి వరలక్ష్మిని నియమిస్తూ రిజిస్ట్రార్‌ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న అమరవేణిని క్యాంపస్‌లోని కామర్స్‌కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించడంతో ఆస్థానంలో వరలక్ష్మిని నియమించారు.

పరీక్షల నియంత్రణాధికారిగా నర్సింహాచారి



కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా కామర్స్‌అండ్‌ బిజినెస్‌మేనేజ్‌మెంట్‌ కళాశాల ప్రొఫెసర్‌ నర్సింహాచారిని నియమిస్తూ రిజిస్ట్రార్‌ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మల్లారెడ్డిని రిజిస్ట్రార్‌గా నియమించడంతో ఆయన స్థానంలో నర్సింహాచారిని నియమించారు.

ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఏటీబీటీ ప్రసాద్‌



కేయూలోని ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్‌ ఏటీబీటీ ప్రసాద్‌ను నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్‌ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఆర్ట్స్‌అండ్‌ సైన్స్‌కళాశాలలో కాంట్రాక్టు ఫిజికల్‌డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏటీబీటీ ప్రసాద్‌ను ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించారు.

కామర్స్‌ అండ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ ప్రిన్సిపాల్‌గా అమరవేణి



కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్‌అండ్‌బిజినెస్‌మేనేజ్‌మెంట్‌ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆ కళాశాల ప్రొఫెసర్‌ పి అమరవేణిని నియమించారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నర్సింహాచారిని పరీక్షల నియంత్రణాధికారిగా నియమించడంతో ఆయన స్థానంలో అమరవేణిని నియమించారు.

కోఎడ్యుకేషన్‌ ఇంజనీరింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌గా సదానందం



కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్‌ ఇంజనీరింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌గా మహిళా ఇంజనీరింగ్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ సదానందాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.